సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 14 । ఏప్రిల్‌ । 2024



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు - 8లో

వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరిగాయి. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనను స్వాగతిస్తూ పార్టీలో చేరుతున్నారు.



25 కేజీల వెండి వస్తువుల పట్టివేత

రాజాం మండల పరిధి పొగిరి ఎన్నికల చెక్‌పోస్టు వద్ద 25 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని రాజాం టౌన్‌ సీఐ డి.మోహనరావు తెలిపారు. - 8లో



ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నిఘా కట్టుదిట్టం - 8లో

ఒడిశా సరిహద్దు గ్రామాల్లో భద్రత కట్టుదిట్టం చేశామని ఎస్‌ఈబీ అసిస్టెంట్‌ కమిషనర్‌ హనుమంతరావు అన్నారు.

న్యూస్‌రీల్‌

ప్రిసైడింగ్‌ అధికారిదే కీలక పాత్ర



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌రోజు ప్రిసైడింగ్‌ అధికారిదే కీలకపాత్ర అని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి కల్పనాకుమారి అన్నారు. స్థానిక వైటీసీ, సామాజిక భవనం, ఐటీడీఏలలో జరుగుతున్న ప్రిసైడింగ్‌, అసిస్టెంట్‌ ప్రిసైడింగ్‌ సిబ్బంది శిక్షణ తరగతులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్‌రోజు పీఓ, ఏపీఓలు చేపట్టాల్సిన విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్‌పోలింగ్‌ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పోలింగ్‌ రోజున నిర్ధిష్ట సమయానికి పోలింగ్‌ ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, మాస్టర్‌ ట్రైనీలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా



పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్‌ నిషాంత్‌కుమార్‌

పాచిపెంట: ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా చెక్‌పోస్టుల వద్ద నిఘాను పటిష్టం చేయాలని కలెక్టర్‌, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్‌ పోలీస్‌ సిబ్బందికి సూచించారు. మండలంలో పి.కోనవలస, పద్మాపురం చెక్‌పోస్టులను ఆయన శనివారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల వద్ద కేసుల నమోదు, నగదు, వాహనాల సీజ్‌ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా చెక్‌పోస్టు తనిఖీలను కంట్రోల్‌రూమ్‌ నుంచి పర్యవేక్షించారు. ఉదాసీనంగా వ్యవహరించే ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తీసుకెళ్తే నగదు, బంగారు ఆభరణాలకు ఆధారాలు ఉండాలన్నారు. మద్యం, మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌, ఎస్‌ఐ నారాయణరావు ఉన్నారు.

స్ట్రాంగ్‌ రూమ్‌ పరిశీలన



స్ట్రాంగ్‌ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్‌: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూమ్‌లను ఆర్డీఓ హేమలత శనివారం పరిశీలించారు. ఈవీఎంల భద్రత చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. స్ట్రాంగ్‌ రూమ్‌ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్ట్రాంగ్‌ రూమ్‌లో సీసీ కెమెరాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్వతీపురం తహసీల్దార్‌ కె.ఆనందరావు, బలిజిపేట తహసీల్దార్‌ జీవీ జనార్ధన్‌, సీతానగరం తహసీల్దార్‌ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణకు సహకరించం

- స్పష్టంచేసిన జనసేన నాయకులు
- పాలకొండలో సమావేశం

వీరఘట్టం/పాలకొండ: పాలకొండ కూటమి అభ్యర్థి జయకృష్ణకు సహకరించేదేలేదని జనసేన నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసం లేని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణకు ఏ ప్రాతిపదికన టికెట్‌ ఇచ్చారని ప్రశ్నించారు. పాలకొండలో జనసేన రాష్ట్ర మహిళా కార్యదర్శి పాలవలస యశస్విని ఇంటి వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పవన్‌కళ్యాణ్‌ తనకు మోసం చేశారంటూ జనసేన నాయకుడు నిబ్రమ్‌ ఆవేదన వ్యక్తంచేశారు. జయకృష్ణ చరిత్రను, ఆయనకు ఉన్న వ్యతిరేకతను పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇటీవల జనసేన పార్టీలో చేరిన పడాల భూదేవి కూడా ఈ సమావేశంలో పాల్గొని తన ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్‌ ఇస్తారని చెప్పడంతో జనసేనలో చేరానని, కనీసం సంప్రదించకుండా జయకృష్ణకు టికెట్‌ కేటాయించడం పార్టీకి తీవ్ర నష్టమని పేర్కొన్నారు.

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని సాలూరు నియోజకవర్గంలో ప్రగతి పొద్దు పొడిచింది. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిశిఖర గ్రామాలకు రాచ'బాటలు' ఏర్పడ్డాయి. విద్య, వైద్య సదుపాయాలు చేరువయ్యాయి. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవల కోసం కొండలు దిగాల్సిన అవసరం తప్పింది. ఏ గూడ.. ఏ ఇంటి తలుపు తట్టినా 'నవరత్న' వికాసం కళ్లకు కడుతోంది. ఐదేళ్లుగా సాగిన సంక్షేమ, అభివృద్ధి పాలన ప్రతి ఒక్కరి మదిలో నిలిచిపోయింది.



సాలూరు మండలంలో నిర్మించిన కందులపథం వంతెన

సాలూరు సెగ్మెంట్‌లో.. ప్రగతి పరుగు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అనేక అభివృద్ధి పనులు
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చొరవతో గిరిజన గూడలకు 'మార్గం'సుగమం
- ఇంటింటా 'నవరత్న'వికాసం
- గిరిశిఖర గ్రామాలకు చేరువైన విద్య, వైద్య సేవలు
- సిగ్నల్స్‌ సమస్యలకు చెక్‌
- సచివాలయ వ్యవస్థతో అక్కరకు వచ్చిన ప్రభుత్వ సేవలు
- కొండల్లో 'సంక్షేమ, అభివృద్ధి' వెలుగులు



సిగ్గులేకుండా లోకేశ్‌ సెల్ఫీచాలెంజ్‌...

ఈ చిత్రం చూశారా... సాలూరు తహసీల్దార్‌ కార్యాలయం ఇది. వాస్తవానికి ఎప్పుడో బ్రిటిష్‌ వారి కాలంనాటి భవనం శిథిలమవ్వడంతో తహసీల్దార్‌ కార్యాలయ భవనాన్ని పునర్నిర్మాణం చేయించింది రాజన్నదొర. అంతకుముందు కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ధర్మాన ప్రసాదరావు రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు రూ.40 లక్షలు మంజూరుచేయించారు. సరిపోకపోతే మరో రూ.10 లక్షలు తీసుకొచ్చారు. నిర్మాణం పూర్తయ్యేసరికి 2014 సార్వత్రిక ఎన్నికల కోడ్‌ వచ్చేసింది. ఆ ఎన్నికల్లో అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకులు రిబ్బన్‌ కట్‌ చేశారంతే. అవగాహన లేని టీడీపీ నాయకుడు నారా లోకేశ్‌ ఇటీవల ఈ భవనం వద్ద సెల్ఫీ చాలెంజ్‌ అంటూ ఫొటోదిగి ఫోజులిచ్చారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటీ ఒక్కటి చూపించండంటే టీడీపీ నాయకులు చెప్పుకోలేరు. వేరెవ్వరో సాధించినవాటిని మాత్రం సొంత ఖాతాలో వేసుకోవడానికి సిగ్గుపడరు. ఇటీవల సాలూరు పర్యటనకొచ్చిన లోకేశ్‌ ఇక్కడ సెల్ఫీదిగడమే దీనికి నిదర్శనం.





సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కొండ.. మైదాన ప్రాంతాల కలబోతగా ఉన్న సాలూరు సెగ్మెంట్‌ ప్రగతి పట్టాలెక్కింది. రాళ్ల దారులన్నీ రాచబాటలయ్యాయి. నాడు–నేడు అనేలా విద్యాలయాలు ముస్తాబయ్యాయి. వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యాయి. పేదలందరికీ పక్కా ఇంటి భాగ్యం దక్కింది. గిరిజనులు సాగు చేసుకునే భూములకు శాశ్వత భూ హక్కు పత్రాలు మంజూరయ్యాయి. గిరిజనుల బతుకులకు కొత్తదారి చూపించేలా 2019–2024 మధ్యలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చొరవతో ఇక్కడ ఎన్నడూలేనంత అభివృద్ధి పనులు జరిగాయి. గిరిజన ప్రాంతాల్లో 12 పెద్ద రోడ్లు, 16 భారీ వంతెనలు నిర్మాణమవుతున్నాయి. మరిన్ని రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇప్పటికే పూర్తి అయిన రోడ్లతో గిరిశిఖర ప్రాంతాలు సైతం మైదాన ప్రాంతంతో అనుసంధానమయ్యాయి. రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడింది. ఇంకా ఎక్కడైనా డోలీ మోత కనిపిస్తే టీడీపీ నాయకులు, పచ్చ మీడియా గగ్గోలుపెడుతోంది. అత్యధిక కాలంలో పాలించిన టీడీపీ హయాంలో డోలీలు అవసరం లేకుండా ఎందుకు ఏర్పాట్లు చేయలేకపోయారంటే సమాధానం ఉండదు. చేయలేకపోయారు కాబట్టే గిరిజనులు టీడీపీని తుడిచిపెట్టేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టారన్నది సత్యం.

ఒక్క రూపాయికే టిడ్కో ఇల్లు



సాలూరులో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించిన స్థలం సుమారు 14 ఎకరాలు రాజన్నదొర తొలిసారి కాంగ్రెస్‌ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే సేకరించారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ కార్యక్రమానికి ప్రోటోకాల్‌ ప్రకారం ఎమ్మెల్యే రాజన్నదొరను కనీసం ఆహ్వానించకపోవడం టీడీపీ నాయకుల పెత్తందారీతనానికి నిదర్శనం. 2019 వరకూ అధికారం అనుభవించినా పునాదులేసి వదిలేశారు. వాటినే మున్సిపల్‌ ఎన్నికల్లోనూ, 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ తమ గొప్పగా చూపించుకోవడానికి కనీసం సిగ్గుపడలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 1,056 టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను రాజన్నదొర చొరవతో పూర్తి చేయించారు. వేగావతి నది నుంచి తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 7 లక్షల లీటర్ల వరకూ నీరు అవసరం. భవిష్యత్తులో పెరిగే అవసరాల దృష్ట్యా 20 లక్షల లీటర్ల సరఫరా లక్ష్యంతో పైప్‌లైన్‌ నిర్మిస్తున్నారు. ఇక్కడున్న మార్కెట్‌ ధర ప్రకారం చూస్తే ఒక్కో ఫ్లాట్‌ ఖరీదు రూ.12 లక్షలు. అంత విలువైన ఆస్తిని ఒక్క రూపాయికే ఇచ్చిన ఘనత వైఎస్సార్‌ ప్రభుత్వానికే దక్కుతుంది. అదే గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వీటిని పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించి ఉంటే ఒక్కొక్కరు 20 ఏళ్లలో వాయిదాలుగా రూ.7 లక్షల వరకూ అప్పు చెల్లించాల్సి వచ్చేది.



100 పడకల ఆస్పత్రి సాకారం

2014 నుంచి ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నా సాలూరులో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం గురించి గత టీడీపీ ప్రభుత్వం ఏరోజూ ఆలోచించలేదు. కానీ 2019 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు వారం రోజుల ముందు మేల్కొని టెంకాయ కొట్టేశారు. అంతే.. ఆస్పత్రికి ఒక్క ఇటుక కూడా వేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17 కోట్లతో ఆస్పత్రి నిర్మాణ పనులను ప్రారంభించింది. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వంద పడకల ఆస్పత్రిగా సీహెచ్‌సీని అప్‌గ్రేడ్‌ చేస్తూ ప్రభుత్వం 22 మంది వైద్యులను నియమించింది. శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నారు. ఈ ఆస్పత్రి నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయని టీడీపీ నాయకులు సిగ్గులేకుండా ఇప్పుడు బురదజల్లుతున్నారు. నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయంటూ పచ్చమీడియా విషం చిమ్ముతోంది.

రైతులకు భరోసాగా సీడ్‌ కార్పొరేషన్‌

పార్వతీపురం మన్యం జిల్లా రైతులకు ఇప్పుడు ఎంతో భరోసాగా నిలుస్తున్న ఏపీ సీడ్‌ కార్పొరేషన్‌ను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సాలూరు నుంచి బొబ్బిలికి తరలించడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. వాటిని ఎమ్మెల్యే రాజన్నదొర నిలువరించడంతో ఎప్పటిలాగే సాలూరులోనే కొనసాగుతోంది. గోదాముల సామర్థ్యం పెంచారు. రైతుల నుంచి మంచి ధరకు వరి విత్తనాల సేకరణ ఏటా విజయవంతంగా జరుగుతోంది.



బైపాస్‌ నిర్మాణంతో కొత్త వెలుగు

సాలూరు పట్టణ పరిసరాల్లో అభివృద్ధి పరుగు తీయడానికి బైపాస్‌ ఎంతో ఉపయోగపడుతోంది. రాజన్నదొర కృషి ఫలితంగా ఇది సాకారమైంది. స్టేట్‌ హైవేస్‌లో భాగంగా భారీ వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి ఇది కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో మంజూరైనా తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయలేక చేతులెత్తేసింది. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ వంతెన పనులకు మోక్షం కలిగించింది.



టీడీపీ నాయకుల అబద్ధాలు నమ్మొద్దు



2014 ఎన్నికల్లో అధికారం కోసం ఎన్నో హామీలిచ్చి ఎగ్గొట్టేసిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం నోటికొచ్చినవన్నీ చెప్పేస్తున్నారు. ఆ టీడీపీ నాయకుల అబద్ధాలను ప్రజలు నమ్మవద్దు. డ్వాక్రా రుణాలు సంపూర్ణంగా మాఫీ చేస్తానని అక్కచెల్లెమ్మలను మోసం చేశారు. సుమారు రూ.75వేల కోట్ల రుణాలను నాలుగు విడతల్లో వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి మాఫీ చేశారు. దాదాపు రూ.87,600 కోట్ల మేర రైతుల రుణాలను మాఫీ చేస్తానన్న చంద్రబాబు రూ.15వేల కోట్లు కూడా చేయలేదు. మూడు సెంట్ల స్థలం, అందులో ఉచితంగా ఇల్లు కట్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఒక్కరికైనా ఇచ్చాడా? ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం లేనివారికి నిరుద్యోగ భృతి అన్నాడు. ఆ హామీ నెరవేర్చితే మరి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భర్తీ చేయడానికి ఖాళీలే ఉండకూడదు కదా? కానీ ఒక్క సచివాలయాల్లో 1.58 లక్షల మందికి జగనన్న శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. వైద్యశాఖలో 50వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశారు. వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 58 నెలల పాలనలో సంక్షేమం, అభివృద్ధి గతంలో ఎన్నడూచూడని రీతిలో సాగాయి. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్‌ ఆసరా, వైఎస్సార్‌ చేయూత, వైఎస్సార్‌ రైతుభరోసా ఇలా నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. సాలూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ప్రణాళికలు ఉన్నాయి. అవన్నీ సాకారం చేసేందుకు ప్రజాప్రతినిధిగా ప్రజలు నాకు మరోసారి అవకాశం ఇస్తారనే విశ్వాసంతో ముందుకెళ్తున్నాను.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి, సాలూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

రెండున్నరేళ్లలోనే అద్భుతాలు...

కరోనా కష్టకాలం, ఎన్నికల సమయం మినహా మిగిలిన రెండున్నరేళ్లలోనే వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను కొత్త పుంతలు తొక్కించారు. సంక్షేమ పథకాల ద్వారా ఒక్క సాలూరు నియోజకవర్గం ప్రజలకే రూ.1,284 కోట్ల మేర ఖాతాల్లోకి వచ్చింది. మరో రూ.400 కోట్లతో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్‌ సెంటర్లు తదితర అభివృద్ధి పనులు జరిగాయి.

జగన్‌పై దాడి హేయమైన చర్య


- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌

పాలకొండ రూరల్‌: అఖండ ప్రజాదరణ కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రిపై దాడి చేయడం హేయమైన చర్య అని, దీనిని అన్నివర్గాలు ముక్తకంఠంతో ఖండించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ అన్నారు. విజయవాడలో రోడ్డు షో జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడి చేయించడం బాధాకరమన్నారు. గతంలో విశాఖ ఎయిర్‌పోర్టులో కత్తితో దాడి చేయించారు. ఇప్పుడు రాళ్ల దాడికి దిగారు. ఇది కేవలం జన హృదయ నేతను జనం నుంచి దూరం చేసేందుకు, అంతమొందించే యత్నంగా భావించాల్సి ఉందన్నారు. జగనన్నను రాజకీయంగా ఎదుర్కొనలేక కేవలం ప్రతిపక్షాలే ఈ తరహా దాడులు చేయించడం దురదృష్టకరమన్నారు. ఏనాడూ ప్రజల అభిమానం, ప్రేమతో ఎన్నికల్లో గెలుపొందలేని వారే ఈ తరహా ఘటనలకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీకే విజయం తథ్యమని గ్రహించి ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నట్టు మండిపడ్డారు. ప్రజా క్షేత్రంలో ఉన్న జగన్‌ను ఏ ఒక్కరూ భయపెట్టలేరని, ప్రజలే ఆయనకు రక్షణగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ ఘటనకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలన్నారు.

జగనన్నపై దాడి అమానుషం



కూటమి కట్టి వస్తున్నా మరోసారి టీడీపీ, జనసేన పార్టీలకు పరాభవం తప్పదని ఒకవైపు సర్వేలన్నీ చెబుతుండటం, ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాదరణ అంతకంతకు పెరుగుతుండటం చూసి దుష్ట చతుష్టం ఓర్వలేకపోతోంది. ఉక్రోషంతో ఎంతకైనా తెగిస్తున్నారు. ప్రాణహాని తలపెట్టడానికీ వెనుకాడట్లేదు. విజయవాడలో టీడీపీ గూండాలు రాళ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడి అత్యంత హేయం. ప్రజాక్షేత్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేక ఇలా భౌతిక దాడులు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం గాకుండా వ్యవస్థలు స్పందించాలి. బాధ్యులను గుర్తించి కఠిన శిక్ష పడేలా చేయాలి.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజినల్‌ కోఆర్డినేటర్‌, జెడ్పీ చైర్మన్‌


జగనన్నను గెలిపిస్తాం



మహిళాలోకం కదలివచ్చింది. విజయనగరం పట్టణంలో తమ అభిమాన నేతలకు మద్దతుగా శనివారం ప్రచారం చేసింది. జగనన్నకే మా ఓటు అంటూ నినదించింది. అక్కచెల్లెమ్మల సంతోషమే లక్ష్యంగా 58 నెలల పాలన అందించిన జగనన్నకు అండగా ఉంటామని తెలియజేసింది. ఫ్యాన్‌ గుర్తుకు ఓటేసి విజయనగరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసింది. సుమారు 8వేల మంది మహిళలు జగనన్నకు జేజేలు పలుకుతూ వైఎస్సార్‌ కూడలి నుంచి కోట కూడలి వరకు సాగారు.

– విజయనగరం

ఎరుకల పేటలో ఏనుగులు



జియ్యమ్మవలస: మండలంలోని గంరమ్మపేట పంచాయతీ ఎరుకలపేట గ్రామ సమీపంలోని వరి పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జన నీరాజనం



కురుపాం మండలం పొడి గ్రామంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మెడలో పూలమాలవేసి హారతిస్తున్న గిరిజన మహిళలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా కురుపాం, పార్వతీపురం నియోజకవర్గంలోని పలు పల్లెలు, వార్డులకు శనివారం వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పాములపుష్పశ్రీవాణి, అలజంగి జోగారావుకు జనం నీరాజనం పలికారు. హారతిచ్చి, విజయతిలకం దిద్దారు. గెలుపు ఆశీర్వచనం అందజేశారు. ఐదేళ్లుగా ప్రజాసంక్షేమానికి కృషిచేసిన జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మదినిండుగా ఆశీర్వదించారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటేస్తామని మాటఇచ్చారు. అభిమాన నేతలతో అడుగుకలుపుతూ అండగా నిలబడ్డారు.

– సాక్షినెట్‌వర్క్‌



సీతానగరం మండలం బుద్దిపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు వెంట నడుస్తున్న జనం

క్లుప్తంగా

25 కేజీల వెండి వస్తువుల పట్టివేత



స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులను పరిశీలిస్తున్న సీఐ మోహనరావు తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి ఎన్నికల చెక్ పోస్టు వద్ద 25 కేజీల వెండి వస్తువులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నామని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు తెలిపారు. శనివారం విశాఖపట్నం నుంచి పాలకొండ వెళ్తున్న బస్సులో తనిఖీలు చేపట్టగా రెండు బ్యాగుల్లో వెండి వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ.20 లక్షల విలువైన 25 కేజీల వెండికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామని తెలిపారు. వెండి వస్తువులతో పాటు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించామని తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ వై.రవికిరణ్, ఏఎస్‌ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లికి చెందిన మంతెన సింహాచలం 12 మద్యం బాటిళ్లు, పాత బొబ్బిలికి చెందిన గుణుపూరు అప్పలనాయుడు 20 మద్యం సీసాలు, అదే గ్రామానికి చెందిన చింతల సత్యనారాయణ 10 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకుని మద్యం సీసాలను సీజ్ చేసినట్టు సీఐ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సీసాలను సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో సిబ్బంది భాస్కరరావు, రమణలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనవమి వసంతోత్సవాలు



యాగశాలలో ప్రత్యేక హవనాలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ, సుందరకాండ పారాయణం చేపట్టారు. స్వామి సన్నిధిలో లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చనను అర్చకులు అత్యంత వైభవోపేతంగా కొనసాగించారు. యాగశాలలో గాయత్రీ రామాయణం, సంక్షేమ రామాయణం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

భోగాపురం: మండల కేంద్రం భోగాపురం జాతీయ రహదారి బస్‌స్టాప్ వద్ద శ్రీసత్యసాయి సేవాసమితి జ్ఞాన మందిరం సభ్యులు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏటా వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. తొలిరోజు ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కాపుగంటి కృష్ణారావు, అట్టాడ సూర్యనారాయణ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఆలయంలో వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు చేశారు. స్వామి వారిని ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఎం.వెంకటాపురంలో..

గజపతినగరం: ఎం.వెంకటాపురం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అర్చకులు చిన్ని భక్తులతో అభిషేకాలు చేయించి, వివిధ పూలమాలలతో అలంకరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250

ఆ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి..



- నాడు వైఎస్సార్, నేడు జగనన్న హయాంలోనే పేదవాని ఆరోగ్యానికి భరోసా
- ఈ రోజు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ మేలు
- గిరిజనం కష్టాలను తీర్చింది ఈ ప్రభుత్వమే..
- మరింత సేవ చేయాలనే వైద్య వృత్తి నుంచి ఇటువైపు వచ్చా..
- మళ్లీ అధికారం చేపట్టేది జగన్‌మోహన్‌రెడ్డినే..
- వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి

ఇంటర్వ్యూ సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, పార్వతీపురం మన్యం: 'చిన్ననాటి నుంచి గిరిజనం మధ్య పెరిగా... వారి కష్టసుఖాలను కళ్లారా చూశా... గతంలో ఏ ప్రభుత్వాలూ వారి బాగోగులను పట్టించుకోలేదు. నాడు వైఎస్సార్.. నేడు జగనన్న ప్రభుత్వమే గిరిజనులను గుర్తించాయి. వారికంటూ ఒక గుర్తింపును తీసుకొచ్చాయ'ని వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణి అన్నారు. వృత్తిరీత్యా వైద్యురాలైన ఆమె పేదలకు, ముఖ్యంగా గిరిజన ప్రజానీకానికి మరింత సేవ చేసేందుకు... వైఎస్సార్‌సీపీనే సరైన వేదికని భావించి ఈసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థినిగా బరిలో దిగుతున్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు వంటి పథకాలు తనకు ఎంతగానో స్ఫూర్తిని కలిగించాయని 'సాక్షి'కి తెలిపారు.

వైద్య వృత్తిలో ఉంటూ రాజకీయాల్లోకి రావాలని ఎందుకు అనిపించింది?

2017లో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ప్రజలకు సేవ చేయడమంటే చాలా ఇష్టం. అందుకే ఈ రంగాన్ని ఎంచుకున్నా. కొన్నాళ్లు కేజీహెచ్‌లో సేవలందించా. కొవిడ్ సమయంలోనూ పని చేశా. పాడేరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎపిడమాలజిస్టుగానూ సేవలందించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఆరోగ్యశ్రీ ఎంతోమందిని ఆదుకుంటోంది. ఆరోగ్యభరోసా, ఫ్యామిలీ డాక్టర్ వంటి ఎన్నో పథకాలను జగనన్న ప్రవేశపెట్టారు. పేదవాడి ఆరోగ్యానికి, వైద్య రంగానికి భరోసా ఇచ్చింది నాడు దివంగత వైఎస్సార్, నేడు జగనన్న ప్రభుత్వాలే. అందుకే పేదలకు మరింత సేవ చేయాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చా.

మీ కుటుంబంలో చాలామంది రాజకీయాల్లో ఉన్నారని తెలిసింది. వారి సూచనలు, సలహాలు తీసుకుంటున్నారా?

రాజకీయాలంటే ఎలా ఉంటాయో.. ఎటువంటి అనుభవాలు ఎదురవుతాయో స్పష్టమైన అవగాహన ఉంది. మా నాన్న హుకుంపేట మండలం అడ్డుమండ పంచాయతీ సర్పంచ్‌గా చేశారు. మా తండ్రి కుటుంబంలోనే ఆరుగురు సర్పంచ్‌లు, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులుగా పని చేశారు. ప్రస్తుత అరకు ఎమ్మెల్యే చెట్టి ఫల్గుణ మా మామయ్య. నా భర్త చెట్టి వినయ్ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ప్రజలకు మనం మంచి చేస్తే వారి గుండెల్లో పెట్టుకుంటారు. లేదంటే మొహమాటం లేకుండా తిరస్కరిస్తారు. మా పెద్దల అడుగుజాడల్లో.. వారి సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగుతాను. పార్లమెంట్‌లో గిరిజనుల గొంతు వినిపిస్తాను. ఇక్కడి ప్రజలకు అన్ని విధాలా అండగా నిలుస్తాను.

వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ పొత్తులతో కూటమిగా వస్తున్నాయి. మీరు ఎలా స్పందిస్తారు?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఎవరితోనూ పొత్తులు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఎవరి మద్దతూ అక్కర్లేదు. జగనన్న ట్రూ లీడర్. కార్యకర్తలే ఆయన బలం. నమ్ముకున్న బలగాన్ని జగనన్న ఏనాడూ వదులుకోలేదు. పొత్తులు పెట్టుకుంటే కార్యకర్తలను వదులుకోవాల్సి ఉంటుందని ఏ రోజూ ఆ దిశగా ఆలోచనలు చేయలేదు. పార్టీలో అందరికీ సమ ప్రాధాన్యం ఇస్తారు. 2019లో ఒక్క ఛాన్స్ అని ప్రజలు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ఈ సంక్షేమ పాలన చూసి జగనన్నే మళ్లీ కావాలని అంటున్నారు.

పార్లమెంట్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

ఏ ఇంటి తలుపు తట్టినా చాలా సంతోషంగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో చాలామంది జీవితాల్లో మార్పు వచ్చింది. ఇటీవల పాలకొండ నియోజకవర్గంలో పర్యటించాం. అక్కడ ఓ వృద్ధ దంపతులు జగనన్న చిత్రపటాన్ని చూడగానే ఉద్వేగానికి లోనయ్యారు. ''జగన్ బాబు మా ఇంటికి తీసుకొచ్చి పథకాలన్నీ ఇస్తున్నాడు. మీరు ఇంత దూరం ఎందుకు వచ్చారమ్మా.. మా ఓటు ఆ బాబుకే. మీరు వెళ్లండి'' అంటూ చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఇలాంటి ఘటనలు అనేకం ఎదురవుతున్నాయి. జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసి రుణం తీర్చుకుంటామని అంటున్నారు. వారే మా పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు.

మళ్లీ జగన్ ప్రభుత్వానికే ప్రజలు ఎందుకు ఓటేయాలి? ఈ ఐదేళ్లలో నియోజకవర్గం పరిధిలో ఎటువంటి మార్పులు చోటుచేసుకున్నాయి.

దశాబ్దాలుగా గిరిజనుల తలరాతలు మారలేదు. నేడు జగనన్న ప్రభుత్వంలో వారి జీవితాల్లో వచ్చిన మార్పులను స్పష్టంగా చూస్తున్నాం. గతంలో అరకు, పాడేరు ప్రాంతాల్లో డోలీల మోతలు అధికంగా ఉండేవి. ఏ చిన్న రోగం వచ్చినా సరైన సమయంలో వైద్యం అందక గిరిజనుల ప్రాణాలు పోతుండేవి. పాడేరు నుంచి విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాలంటే నాలుగు గంటల సమయం పట్టేది. జగనన్న ప్రభుత్వంలో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. మా ప్రాంతంలో రూ.540 కోట్లతో నిర్మితమైన వైద్య కళాశాల వల్ల గిరిజనులకు వైద్యం చేరవవుతోంది. ఇప్పుడు కేజీహెచ్‌కు రిఫరల్ కేసులు ఉండవు. రూ.1,100 కోట్లతో 310 రహదారులు నిర్మాణమయ్యాయి. గతంలో గర్భిణులను డోలీల్లో ప్రసవం సమయంలో తీసుకొచ్చేవారు. ఇప్పుడు ముందే ప్రత్యేక గృహాలు, వైద్య సదుపాయం ఏర్పాటు చేసి కిందకు దించుతున్నాం. అక్కడ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇలా ఇప్పటి వరకు 299 మంది వరకు ప్రసవాలు పోసుకున్నారు. ఇప్పుడు డోలీల సమస్య 80 శాతం వరకు తగ్గింది. తాగునీటి సమస్య తీరింది. గతంలో మా ప్రాంతంలో కొండలపై ఉన్న వారు కిందకు దిగాలంటే వారానికి ఒకసారే. అప్పుడే తమకు కావాల్సిన వస్తువులను తీసుకునేవారు. ఇప్పుడు రహదారుల కనెక్టివిటీ పెరిగింది. నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. ఆర్‌బీకేలు, సచివాలయాలు వచ్చాయి. వేలాది మందికి అందులో ఉద్యోగాలు లభించాయి. గ్రామాల్లోనే అన్ని రకాల సేవలూ అందుతున్నాయి. ఇలాంటి అభివృద్ధి జరగాలంటే కనీసం 15-20 ఏళ్లు పడుతుంది. అదే జగనన్న ప్రభుత్వంలో కొవిడ్ వల్ల రెండేళ్లు పోయినా మిగిలిన మూడేళ్లలో పూర్తి చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇదే తరహా సౌకర్యాలన్నీ కలిగాయి. అందుకే జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ఓటేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉంది.

పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలి



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

కురుపాం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని సమర్థంగా విధులు నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులకు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ నిషాంత్ కుమార్ సందర్శించారు. ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన ప్రవర్తనా నియమావళి, తీసుకోవలసిన జాగ్రత్తలు, విధులు నిర్వహణ తదితర అంశాలపై అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట ప్రజాస్వామ్యానికి జరుగుతున్న ఎన్నికల్లో భాగస్వామ్యం అయినందున చిత్తశుద్ధితో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని భావించి ఎటువంటి ఆరోపణలు లేకుండా స్వేచ్ఛగా ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ప్రిసైడింగ్ అధికారులు, సెక్టర్ అధికారులు కీలకమని అన్నారు. ఎక్కడ ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు ఏమైనా అనుమానాలు ఉంటే శిక్షణలో పూర్తి స్థాయిలో నివృత్తి చేసుకోవాలన్నారు. మాక్ పోలింగ్ మొదలుకొని స్ట్రాంగ్ రూములో ఈవీఎంలు భద్రపరిచే వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నడుచుకోవాలని అతిక్రమించిన, నిర్లక్ష్యం చూపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ పూర్తయిన తరువాత ప్రిసైడింగ్ అధికారి డైరీ రాయడం, ఫారం 17 సీ నింపడం వంటి చర్యలపై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను కలిపే కేబుల్స్ ఉపయోగించడంలో తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈవీఎంల మొరాయింపు వంటి అంశాలు ఉత్పన్నం కావని ఆయన స్పష్టం చేశారు. సెక్టార్ అధికారులు సైతం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియ పైన, ప్రిసైడింగ్ అధికారుల విధులపైన సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వారికి తలెత్తే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసే స్థాయిలో ఉండాలని తెలిపారు. సెక్టార్ అధికారులు ఎన్నికల కమిషన్‌కు ఫస్ట్ రెస్పాండర్‌గా ఉంటారని ఆయన తెలిపారు. అనంతరం మాక్ పోలింగ్‌ను పరిశీలించారు. పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి, కురుపాం శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణ, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విధి వంచితుడు

- ఢిల్లీలో విద్యుత్ షాక్‌తో జవాన్ మృతి
- సొంతూరు గొట్ట మంగళాపురంలో విషాదం



మృతుడు సామంతుల రాంబాబు(ఫైల్)

పాలకొండ రూరల్: విధి వంచనకు ఓ జవాన్ అసువులు బాశాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడికి ఉద్యోగం వస్తే ఆ తల్లిదండ్రులు ఎంతో సంబరపడ్డారు. ఇటీవలె ఏడు నెలల కిందట ఆ కుమారుడికి వివాహం కూడా చేశారు. ఇంతలోనే విధి కన్నెర్ర చేసింది. ఇటు తల్లిదండ్రుల ఆశలను, అటు భార్యకన్న కలలు కల్లలయ్యాయి. విద్యుత్ షాక్ రూపంలో మృత్యు ఒడిలోకి తీసుకుపోయింది. వివరాల్లోకి వెళ్తే.. పాలకొండ మండలం గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన సామంతుల రాంబాబు(31) ఎంతో కష్టపడి సెంట్రల్ ఇండస్ట్రియల్ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో కొన్నాళ్ల కిందట కొలువు సాధించాడు. విధి నిర్వహణలో భాగంగా ఢిల్లీలో పని చేస్తున్నాడు. ఇటీవల జరిగిన రంజాన్ వేడుకల్లో చోటు చేసుకున్న అపశ్రుతి కారణంగా మూడు రోజుల కిందట విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. శరీరంగా తీవ్రంగా కాలిపోయింది. ఈ క్రమంలో ఢిల్లీలో వైద్య సేవలు పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. రాంబాబు మృతదేహం శనివారం సంబంధిత అధికారులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. రాంబాబు మృతదేహం చూసి ఇటు కుటుంబీకులు, అటు గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తల్లిదండ్రులు నారాయణరావు, విజయలక్ష్మి, భార్య జ్యోతి గుండెలవిసేలా రోదించారు. వీరి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. జ్యోతి భర్తతో పాటే ఢిల్లీలో ఉంటుంది. సీఐఎస్ఎఫ్ అధికారులు రాంబాబు మృతదేహానికి గౌరవ లాంఛనాలతో వందనం సమర్పించారు. ఈ క్రమంలో భార్య జ్యోతిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నిఘా కట్టుదిట్టం

- ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

పార్వతీపురం టౌన్:

ఒడిశా సరిహద్దు గ్రామాల్లో భద్రత కట్టుదిట్టం చేశామని ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు అన్నారు. స్థానిక ఎస్ఈబీ సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లాలో గల సీఐలు, ఎస్ఐలతో శనివారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని మరింత అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనానికి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఒడిశా నుంచి అక్రమంగా సారా, గంజాయి రవాణా కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఆయన తెలిపారు. నిఘా మరింత పటిష్ఠ పరచి అనుమానం ఉన్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బంది మరింత కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలకు, అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీ నుండి వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన మొత్తం 150 కుటుంబాలు మేదర వీధి, మహంతి వీధి, గంటా వీధి, బండి వీధుల నుంచి వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే జోగారావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరందరూ కలిసికట్టుగా పని చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకునేందుకుగాను అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అలాగే తనను కూడా ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చని, మీకు ఎల్లవేళలా ఒక అన్నదమ్ముడుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ జమాన ప్రసన్నకుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవి కుమార్, స్థానిక కౌన్సిలర్ తాడ్డి అరుణ శంకర్రావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ షఫీ, జేఏవైస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, శుభలేఖ శ్రీను, పెద్ద రెడ్డి, చిటికన్నా, త్రినాధ, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని ఎస్ఐ జ్ఞానప్రసాద్ తన సిబ్బందితో కలిసి శనివారం సారా బట్టీలపై దాడులు చేశారు. చందాపురం శివారులో 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చందాపురం పరిసరాలలో సారా తయారీ అవుతుందన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. సారా తయారీ కోసం సిద్ధం చేసి ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఎస్పీ దీపికాపాటిల్ ఆదేశాల మేరకు సారా తయారీ బట్టీలపై విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సారా అక్రమ తయారీదారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

527 లీటర్ల సారా ధ్వంసం



సారాను ధ్వంసం చేస్తున్న పోలీసు సిబ్బంది

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీసుస్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన 527 లీటర్ల సారాను పట్టణ శివారుల్లో ఏఎస్పీ సునీల్ షరైన్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు పట్టణ సీఐ వీవీఎస్ఎన్ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పట్టణంలో 8 కేసుల్లో పట్టుబడిన సారాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేశామన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో సారా రవాణా, తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అమ్మకాలు, రవాణా వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం



రికవరీ చేసిన వస్తువులను చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

- ఇద్దరు మహిళల అరెస్ట్

విజయనగరం క్రైమ్: చోరీ కేసుకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ మేరకు శనివారం వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక సంతకాల బ్రిడ్జి వద్ద ఆటో ఎక్కి, కలెక్టరేట్ వద్ద ఆటో దిగిన సబ్బవరం మండలం టిక్కలిపాలెం గ్రామానికి చెందిన మంచాడ సునీతను ఏప్రిల్ 12న అదే ఆటోలో ప్రయాణించిన ఇద్దరు మహిళలు ఆటో నుంచి తోసివేసి, ఆమె చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌తో సహా తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను తీసుకుని అక్కడ సమీపంలో ఉన్న సందుల్లోకి పారిపోయినట్లు బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ జె.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టి నేరానికి పాల్పడిన ఇద్దరు మహిళలను వంగర మండలం పోతుల గుమ్మ గ్రామానికి చెందిన ఆవుల పార్వతి, కొత్తవలస 202 కాలనీకి చెందిన గంటా మీనాలుగా గుర్తించారు. నిందితులు చోరీ సొత్తును అమ్మేందుకు శనివారం పట్టణంలో తిరుగుతుండగా వారిని గుర్తించి, అరెస్టు చేసి, వారి నుంచి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. బాధితురాలు సునీత బొబ్బిలిలో తన అక్క కొడుకు నిశ్చితార్థానికి వెళ్లే క్రమంలో కెఎల్.పురంలో ఉన్న తన అక్క కూతురు ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కినట్లు ఆయన తెలిపారు. నేరం జరిగి, ఫిర్యాదు చేసిన ఐదు గంటల వ్యవధిలోనే వన్‌టౌన్ క్రైమ్ బృందం నిందితులను గుర్తించి, అరెస్టు చేసి, రికవరీ చేసినందుకు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ బి.వెంకటరావులు అభినందించారు.

నగదు తరలిస్తే పత్రాలు తప్పనిసరి

బొండపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి నగదును తరలించాల్సి వస్తే తప్పనిసరిగా అందుకు తగినపత్రాలు ఉండాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారి-26పై పోలీసు సిబ్బందితో కలిసి శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహ నాల్లో ఎక్కువ మొత్తంలో నగదు కాని, వస్తువులు కాని తరలించా ల్సి వచ్చేటప్పుడు సంబంధిత పత్రాలు ఉండాలని చెప్పారు.

రైల్వే స్టేషన్ల వద్ద తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ వద్ద, మరడాం,పెదమానాపురం రహదారులపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వాణిశ్రీ ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా సోదాలు చేశారు. అనుమతులు లేకుండా ఎక్కువ మొత్తంలో వస్తు, సామగ్రిని, పరిమితికి మించి నగదు తరలించరాదని వాహన చోదకులకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సూచించారు. నగదు,వస్తు సామగ్రి తరలించేటప్పుడు తగిన ఆధారాలు చూపించాలని అన్నారు.